క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన కీర్తి శరణ్య నీట్ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 979 ర్యాంకు సాధించింది. నిరుపేద కుటుంబ కావడంతో ఎంబీబీఎస్ చదవాలన్న ఆమె లక్ష్యానికి ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారింది. ఈ మేరకు నానేస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం కీర్తి శరణ్యకు రూ.25,016 అందజేశారు. ట్రస్టు మాజీ అధ్యక్షుడు కట్ల సత్యనారాయణ, సభ్యులు తానిపర్తి సుధాకర్‌రావు, కట్ల సంపత్, రంగు రాములుగౌడ్, వీరస్వామిగౌడ్, ప్రకాష్, మాజీ సర్పంచ్ పెద్ది సమ్మయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ

సుల్తానాబాద్‌రూరల్: వాహనాదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే వాహనాలను సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను ఆపి వాహన, లైసెన్స్ లేని వారికి జారిమానా విధించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న చలాన్లు వసూలు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్టర్, ఇన్సూరెన్స్ తప్పనిసరి అని పేర్కొన్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ మహేందర్ తదితరులున్నారు.

కిడ్నీ బాధితుడికి సాయం


నగదు అందజేస్తున్న స్నేహితులు

ధర్మారం: ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన బొడ్డు లచ్చయ్య కిడ్నీవ్యాధితో బాధపతుండగా చిన్ననాటి స్నేహితులు ఆదివారం రూ.10వేల నగదు అందించారు. మేడారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తమతో చదువుకున్న బొడ్డు లచ్చయ్య రెండు కిడ్నీలు చెడిపోయి చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న చిన్ననాటి మిత్రులు ఇంటికి వచ్చి నగదు అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన వైలగాని రాజుకు రూ.60వేలు, కాట మల్లయ్యకు రూ.18వేలు, అప్పాల రాజమ్మకు రూ.10,500 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. కాగా చెక్కులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

పునాదుల్లోనే భవన నిర్మాణం

- కమ్యూనిటీ హాల్‌లో పంచాయతీ కార్యకలాపాలు
- ఏకగ్రీవ పంచాయతీకి అందని ప్రభుత్వ పరిహారం


పునాదుల్లోనే పంచాయతీ భవన నిర్మాణం

రామగుండం: పంచాయతీ పాలకవర్గం గడువు పూర్తయ్యేందుకు సమీపిస్తున్నప్పటికీ అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ పంచాయతీ పక్కా భవన నిర్మాణ పనులు మాత్రం పునాదులు దాటకపోవడంపై గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కమ్యూనిటీ హాల్‌లోని ఓ గదిలో తాత్కాలికంగా పంచాయతీ కార్యాలయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఐదేళ్ల క్రితం ముర్మూర్ గ్రామ పంచాయతీలో అంతర్భాగంగా ఉన్న ఎల్లంపల్లి గ్రామం నూతన గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. ఈ నేపథ్యంలో సర్పంచ్‌తో పాటు ఎనిమిది మంది వార్డు సభ్యులకు బరిలో ఉన్న సభ్యుల మధ్య ఏకాభిప్రాయంతో పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేసుకోగా ప్రభుత్వం అందించే రూ.20 లక్షల పరిహారానికి అర్హత సాధించారు. కాగా నాలుగున్నరేళ్లయినా ఇప్పటికీ పంచాయతీ పక్కా భవన నిర్మాణానికి సరిపడా నిధులు మంజూరు కాలేదు. మంజూరైన డీఎంఎఫ్‌టీ నిధులకు సరిపడా పనులు చేశారు. త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



అసంపూర్తి దశలో ఉన్న గ్రామ పంచాయతీ పక్కా భవన నిర్మాణానికి సత్వరమే నిధులు కేటాయించేందుకు ఎమ్మెల్యే దృష్టిసారిస్తే ప్రస్తుతం ఉన్న పాలకవర్గ గడువు ముగిసేలోగా నూతన భవనం అందుబాటులోకి వస్తుంది. ఎన్నికల కోడ్ వస్తే మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారుతుంది. త్వరగా భవన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– అరుముళ్ల మల్లేశ్, గ్రామస్తుడు

పనులు చేపట్టాం



మా పాలకవర్గ హయాంలోనే పంచాయతీకి నూతన పక్కా భవనం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఆరునెలల క్రితం ఎమ్మెల్యే చందర్ డీఎంఎఫ్‌టీ నిధులు రూ.8.70 లక్షలు మంజూరు చేసిన నిధులతో నిర్మాణ పనులు చేపట్టాను. పక్కా భవన నిర్మాణానికి పంచాయతీకి వచ్చే నిధులు సరిపోవు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఇస్తే భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేస్తాం.

– గుమ్ముల రవీందర్, సర్పంచ్, ఎల్లంపల్లి

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలి


ఎలిగేడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎలిగేడు: కాంగ్రెస్ నాయకులు చెప్పే మోసపు మాటలను నమ్మొద్దని, రైతన్నకు మేలు చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రైతులతోపాటు అన్నివర్గాల ప్రజలు అండగా ఉండి మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రైతులకు 3గంటల కరెంట్ సరిపోతుందని మాట్లాడటం రైతులను అవమానించడమేనని, మాటలను వెనక్కితీసుకుని రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలిగేడులోని రైతువేదికలో రైతన్న మేలుకో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుబంధు జిల్లా కన్వీనర్ అనంతరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, రైతబంధు మండల కోఆర్డినేటర్ నరినేని సుధాకర్‌రావు, సర్పంచ్ భూర్ల సింధూజ, ర్యాకల్‌దేవుపల్లి కోఆర్డినేటర్ నర్సింగం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, రాయనర్సయ్య, మోహన్‌రావు, మహేందర్, పెద్ది సమ్మయ్య, తానిపర్తి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతుల అరిగోస

జూలపల్లి: 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులను అన్నిరకాలుగా అరిగోస పెట్టిందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాలులో ఆదివారం సర్పంచ్ నర్సింహయాదవ్ అధ్యక్షతన జూలపల్లి, అబ్బాపూర్, కుమ్మరికుంట, కోనరావుపేట గ్రామాల రైతులతో రైతన్న మేలుకో సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు మూడు గంటల కరెంటు చాలు అన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, రైతు సమన్వయ సమితి జిలా అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి, ఎంపీపీ రమాదేవి, వైస్ ఎంపీపీ రమేశ్, సర్పంచులు సంతోష్‌రావు, ఈర్ల మల్లేశం, ఎల్లయ్య, రాజయ్య, ఎంపీటీసీలు మల్లేశ్‌యాదవ్, శ్రీనివాస్, నాయకులు చొక్కారెడ్డి, విసారపు వెంకటేశం, లోక రవీందర్‌రెడ్డి, నాడెం మల్లారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, అడప లక్ష్మన్, కుంట రాజేశ్వర్‌రెడ్డి, లాల్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల నిరసన


ఎలిగేడు మండల కేంద్రంలో..


బోనాలతో తరలివెళ్తున్న కార్మికులు

ఎలిగేడు: మండల కేంద్రంలో జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 18వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు అందరూ తలలకు ఉరితాడు వేసుకుని ప్రభుత్వంపై నిరసన తెలిపారు. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజ, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, కార్మికులు ఆసంపల్లి చంద్రయ్య, సరీన్, కొండయ్య, మొగిలి, నర్సయ్య, సత్యనారాయణ, నర్సయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 18వ రోజుకు చేరింది. నాయకులు కొమురయ్య, సంపత్, రాజేశ్వరి, అనసూయ, లక్ష్మి పాల్గొన్నారు.

పోచమ్మకు బోనాలతో నిరసన

ధర్మారం: గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్మారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం కార్మికులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి డప్పు చప్పుళ్లతో పోచమ్మ ఆలయం వరకు మహిళలు బోనాలతో తరలివెళ్లారు. అనంతరం పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల సాగు


సాగుకు సిద్ధంగా ప్రభుత్వ భూములు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని మద్దిర్యాల-విసంపేట గ్రామాల శివారులోని సర్వే నెం.365, 369లో సుమారు 60 ఎకరాల ప్రభుత్వ భూములను పలువురు రైతులు యథేచ్ఛగా సాగు చేస్తున్నారు. ఇందులో హరితహారం పథకంలో భాగంగా మొక్కలు నాటిన భూములను సైతం విసంపేట, మద్దిర్యాల గ్రామస్తులతో పాటు పొరుగు గ్రామాలకు చెందిన పలువురు సాగు చేస్తున్నారు. ఈ విషయమై అంతర్గాం తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటున్న విషయం తన దృష్టికి రాలేదని, క్షేత్రస్థాయిలో సందర్శించి సాగు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తానని చెప్పారు.

కేసీఆర్ పెద్దపల్లి నుంచి పోటీని స్వాగతిస్తున్నాం


మాట్లాడుతున్న నాయకుడు తిమోతీ

గోదావరిఖనిటౌన్: సీఎం కేసీఆర్ పెద్దపల్లి నుంచి పోటీ చేస్తున్నట్లు వస్తున్న వార్తల దృష్ట్యా టీఎంఆర్‌పీఎస్ పెద్దపల్లి జిల్లా కమిటీ పూర్తిగా స్వాగతిస్తున్నట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యాసర్ల తిమోతీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో జిల్లా వెనుకబడి ఉందని కేసీఆర్ ఇక్కడ నుంచి పోటీ చేయడంతో అభివృద్ధికి అస్కారం ఏర్పడుతుందన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థ ఉదారత

రామడుగు: రామడుగు మండలం గోపాల్‌రావుపేట ఎస్సీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఇటీవల కురిసిన వర్షాలకు కేంద్రంలోని నీరు వచ్చి పిల్లలు అసౌకర్యానికి గరవుతున్నారు. ఈ విషయం శ్రీలక్ష్మీ నరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థకు కేంద్రం టీచర్ సావిత్రమ్మ తెలియజేయడంతో స్పందించిన సంస్థ సభ్యులు ఆదివారం కేంద్రంపై ప్లాస్టిక్ కవర్ కప్పి ఉదారతను చాటుకున్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి కనుకయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి రవి శాస్త్రి, గౌరవ అధ్యక్షుడు ఒద్దుల హనుమంతరెడ్డి, కోశాధికారి దాసరి మల్లేశం, జాయింట్ సెక్రెటరీ వడ్లూరి సిద్దు, ఉపాధ్యక్షుడు మేక సాయికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

సమ్మెలో కార్మికులు.. విధుల్లో పాలకవర్గం


పెగడపల్లిలో క్లోరినేషన్ చేస్తున్న పాలకవర్గం

కాల్వశ్రీరాంపూర్: పంచాయతీ కార్మికులు 18 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం విదితమే. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పెగడపల్లి సర్పంచ్ ఆరెల్లి సుజాత, కార్యదర్శి సౌజన్య ఆదివారం బావుల్లో క్లోరినేషన్ చేశారు. సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా పాలకవర్గం చర్యలు చేపడుతోంది.

నియామకం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా బూస తిరుపతిని, ఉపాధ్యక్షులుగా మాతంగి సదానందం, నీర్ల కొమురయ్యను ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు తెలిపారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల నిరసన


మాట్లాడుతున్న నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల నిరసన ఆదివారం ఉదయం అరగంట పాటు కొనసాగింది. లేబర్ గేట్ రోడ్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు మాట్లాడారు. శనివారం యాజమాన్యంతో జరిగిన చర్చలు వాయిదా పడ్డాయని, పాత వేతన ఒప్పందంలో పెండింగ్‌లో ఉన్న కొన్ని అంశాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 28వ తేదీ లోపు పాత వేతన ఒప్పందంలోని పూర్తి పెండింగ్ అంశాలను అమలు చేయడంతో పాటు 29న జరగనున్న చర్చల్లో ఆర్థికపరమైన అంశాలతో పాటు తదితర డిమాండ్లపై చర్చ జరగనుందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్ పాల్గొన్నారు.

ఓదెల మండలంలో భారీ వర్షం


ఓదెల: కురుస్తున్న వర్షం

ఓదెల: ఓదెల మండలంలో ఆదివారం భారీగా వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వారంరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి ఎక్కువైంది. వర్షాలకు వరద ఎక్కువ కావడంతో కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో ఉన్న రైల్వే వంతెనలకు ముప్పు వాటిల్లి అవకాశం ఉందదని రైల్వేసిబ్బంది ముందస్తుగా అలర్ట్ అయ్యారు. సికింద్రాబాద్ నుంచి బల్లార్షా వయా న్యూఢిల్లీ వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు తక్కువ వేగంగా నడుస్తున్నాయి. మానేరు వంతెనల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తున్నారు. సిగ్నల్స్ సిస్టం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

మణిపూర్ ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


గోదావరిఖని: ఆందోళన చేస్తున్న నాయకులు



జ్యోతినగర్: నిరసన తెలుపుతున్న లక్ష్మి

గోదావరిఖని: మణిపూర్ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక లేబర్‌కోర్టు పైలాన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజన్న, ఇ.నరేశ్, వెంకన్న, బి.అశోక్, చిలుక శంకర్, ఎం.దుర్గయ్య పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

గోదావరిఖని: ఆదివాసీలపై జరుగుతున్న దాడిని నిరసిస్తూ ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో మణిపూర్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు కోటగిరి పాపయ్య, సంగెపు రాజు, రెడ్డి స్వరాజ్యం, బరిగెల కళావతి, మాటి లక్ష్మి, రాజకుమారి పాల్గొన్నారు.

దేశానికే మాయని మచ్చ

జ్యోతినగర్: మణిపూర్ ఘటన దేశానికే మాయని మచ్చ అని, ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రధాని పదవికి రాజీనామా చేయాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా అనుబంధ పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్ ఏరియాలో ఆదివారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, రాయమల్లు, స్వరూప స్పందన, లక్ష్మి పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పండి

గోదావరిఖనిటౌన్: కొన్ని రోజులుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండ చివరకు మహిళల మాన ప్రాణాలను బలి తీసుకుంటోందని నేషనల్ యూత్ ప్రాజెక్టు రాష్ట్ర అధ్యక్షుడు యాదవ రాజు అన్నారు. ఎన్‌వైపీ, ఏక్తా పరిషత్ తెలంగాణ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కళ్యాణ్‌నగర్‌లో మణిపూర్ ఘటనకు సంఘీభావంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. డా.ఎస్.నారాయణ, డా.లక్ష్మీవాణి, డా.ఎం.శంకర్‌లింగం పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన

రామగుండం: మణిపూర్ ఘటనల నేపథ్యంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్‌లో మహిళలు నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని ప్లకార్డులతో నిరసన తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ నిమ్మరాజుల సాగర్, నిమ్మరాజుల మాధవి, మాజీ ఎంపీటీసీ పద్మ, పవిత్ర, నవ్య, పద్మ, స్వరూప, దీప, శ్రీలత, సంధ్య, శ్రావణి, సరిత పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీతారామ సేవాసమితి పరిచయ వేదిక

- పలువురికి ఆర్థికసాయం


వరలక్ష్మికి నగదు అందిస్తున్న గ్రూప్ సభ్యులు

జ్యోతినగర్: అందరికీ ఆదివారం సెలవు. కానీ శ్రీసీతారామ సేవా సమితి వాట్సాప్ గ్రూప్ సభ్యులు సమాజ సేవలో పాల్గొనే రోజు. ఆరునెలల క్రితం వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పరుచుకుని ప్రతి నెలా ఒక సభ్యుడు రూ.100 జమ చేసి వాటితో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రస్తుతం 91 మంది సభ్యులు ఉన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అందరూ కలిసి పరిచయ వేదికగా ఏర్పాటు చేసుకున్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని ఓ హాలులో వాట్సాప్ గ్రూప్ అడ్మిన్స్ గోలివాడ చంద్రకళ, కంది సుజాత, తగురం వనజ, ఇందారపు సునీత, పొన్నం రాజమణి, రమ్యాయాదవ్, మండల రమాదేవి, శైలజ కలిసి పరిచయ వేదిక నిర్వహించారు. మొదటి పరిచయ వేదిక కార్యక్రమంలో అన్నపూర్ణకాలనీకి చెందిన ఓ అనారోగ్య బాధితురాలు కనకం వరలక్ష్మికి గ్రూప్ సభ్యులు రూ.3వేలు, కంది నాగరాజు–సుజాతకు రూ.2వేలు, రెండో డివిజన్ కార్పొరేటర్ రమణారెడ్డి రూ.వెయ్యి అందించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. సమితి సభ్యులు లక్ష్మి, సరిత, శైలజ, సౌజన్య, భాగ్యలక్ష్మి, స్వప్న, సుప్రియ, అరుణ, భవాని, పోరండ్ల కొమురయ్య, లింగమూర్తి, లింగయ్య, సతీశ్‌గౌడ్, తిరుపతి, సంతోష్ సాయి పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిం విజేతలకు బహుమతి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సి ఇండియా రైజింగ్ (సార్ ఫౌండేషన్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి లఘు చిత్రాల్లో భాగంగా నవ సమాజ నిర్మాణం కోసంపై నిర్వహించిన షార్ట్ ఫిలిం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి అందజేశారు. ఉత్తమ షార్ట్ ఫిలిం మొదటి బహుమతి నందిని షార్ట్ ఫిలిం, ద్వితీయ బహుమతి రైతు బుచ్చన్న పటేల్, తృతీయ బహుమతి పెద్దపల్లి టూన్స్ సాయి గౌడ్ గెలుపొందారు. పోటీలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి అందించారు.

జీజీహెచ్‌ను పరిశుభ్రంగా మార్చండి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఆస్పత్రి అధికారులకు టీడీపీ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యదర్శి, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు, నాయకులు కంది చంద్రయ్య, ముదిగంటి దామోదర్‌రెడ్డి, రాజనర్సు, కళావతి, అశ్విని ఉన్నారు.



గర్రెపల్లి చెరువుకు జలకళ

సుల్తానాబాద్‌రూరల్: వరుసగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. మండలంలోని గర్రెపల్లి పెద్ద చెరువు వరద నీటితో నిండుకుండలా మారింది. దీంతో రైతులు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.